BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com
హైదరాబాద్ గురువారం , 02 జనవరి-2025
balagamtv100@gmail.com
పేజీలు-4

నిజమే మా బలం.. ప్రజలే మా బలగం

## 926 కోట్లు తాగేసిండ్రు..



2లో..

## బోనులో చిక్కిన పెద్దపులి..

ఊపిరి పీల్చుకున్న ఉమ్మడి ఆదిలాబాద్



2లో..

# అన్నం పెట్టే రైతులను కాంగ్రెస్ అవమానిస్తోంది..

### ధ్వజమెత్తిన హరీశ్‌రావు



హైదరాబాద్- అన్నం పెట్టే రైతులను కాంగ్రెస్ అవమానిస్తోందని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. సంగారెడ్డిలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాగునీరు సౌకర్యం లేని రైతులే పత్తి సాగు చేస్తారన్నారు. 50 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్న దళిత గిరిజన బీసీ రైతుల నోట్లో మట్టి కొట్టడమేనన్నారు. చెరుకు పసుపు పండ్లతోటకు పెట్టుబడి ఎక్కువని.. అలాంటప్పుడు ఆ రైతులకు ఒకటేసారి రైతు భరోసా ఇస్తానంటే ఎట్లా? అంటూ ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో లక్ష ఎకరాల్లో చెరుకు పంట పండుతుందని.. లక్ష ఎకరాల్లో పసుపు పంట పండుతుందని తెలిపారు. 10 లక్షల ఎకరాల్లో మామిడి తోటలు, ఆయిల్ పామ్ తోటలు, ఇతర పండ్ల తోటలు ఉన్నాయని.. 10లక్షలు ఎకరాల్లో దాదాపు కంది సాగు జరుగుతుందన్నారు. ఇలాంటి రైతులకు ఒకటేసారి రైతు భరోసా ఇస్తానంటే ఎలా? అంటూ నిలదీశారు. రాళ్లు రప్పలకు రైతు భరోసా ఇవ్వమంటున్నారని.. కొండల్లో, గుట్టల్లో ఉండేది గిరిజన రైతులు మాత్రమేనన్నారు. అంటే గిరిజన రైతులకు రైతు భరోసా ఎగ్గొట్టాలని ప్రభుత్వం చూస్తున్నదా? అని నిలదీశారు. అన్ని ఆలోచించిన కేసీఆర్ రైతుల ఆత్మ గౌరవం కాపాడాలని ఉద్దేశంతో అందరికీ రైతుబంధు ఇచ్చి గౌరవించారన్నారు. అందరికీ అన్నం పెట్టే రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం అవమానిస్తుందన్నారు. రైతు గౌరవాన్ని కేసీఆర్ పెంచితే.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను అడుక్కునేలా చేస్తుంద న్నారు. దరఖాస్తులు పెట్టి పైరవీకారుల చుట్టూ తిరిగేలా చేస్తుందన్నారు. అందరికీ అన్నం పెట్టే రైతులు అడుక్కునే వారిలా మార్చకండి అంటూ హితవు పలికారు. అందరు రైతులకు రైతు భరోసా ఇవ్వాలని సూచించారు. అకాల వర్షాల వల్ల పత్తి రైతులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని.. పత్తి దిగుబడి తగ్గిందన్నారు. వర్షం ఆధారంగా పత్తిని సాగు చేస్తారని.. ఎక్కువ మంది దళిత గిరిజన బీసీ రైతులే ఉంటారన్నారు. వాళ్ల కడుపు కొట్టకండని.. సంవత్సరానికి ఒకేసారి పండిన పంటైనా సరే దానికి పెట్టుబడి ఎక్కువ ఉంటుందన్నారు. చెరుకు, పత్తి, పసుపు, ఇతర హార్టికల్చర్ పంటలు సంవత్సరానికి ఒకసారి పండినా వాటిక అయ్యే ఖర్చు ఎక్కువగానే ఉంటుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కోతలు.. తప్ప రైతులకు ఇచ్చిందేమీ లేదన్నారు. రుణమాఫీ సగం మందికే అయ్యిందని.. అన్ని పంటలకు బోనస్ అని చెప్పి.. కేవలం సన్నాలకు మాత్రమే బోనస్ ఇస్తామంటున్నా రన్నారు. పంటల బోనస్ విషయంలో పది పంటలకు బోనస్ ఇస్తామని ఒక్క పంటకే బోనస్ అని అందులో సన్న రకాలకే బోనస్ ఇస్తామంటున్నారన్నారు.

రైతుబంధు వానకాలం ఎగొట్టారని.. యాసంగి ఎగ్గొట్టే కుట్ర చేస్తున్నారన్నారు. పంటలకు బీమా అసెంబ్లీ స్పీచ్‌లో చెప్పారని.. వానాకాలంలో అడుగుతే ఏసంగిలో ఇస్తామన్నారన్నారు. యాసంగిలో అడుగుతే మల్ల వచ్చే సంవత్సరం చూస్తామని అంటున్నారన్నారు. రైతులకు వ్యవసాయ పనిముట్లు ఇస్తామని ఇవ్వలేదని.. పాడి రైతులకు ప్రోత్సాహమని చెప్పి.. అదీ ఇవ్వలేదన్నారు. 24 గంటల కరెంటు అన్నారని.. 16 గంటలకు నుంచి కరెంటు ఇవ్వడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన ఒక్క హామీ అయినా నిలబెట్టుకున్నారా? అంటూ ప్రశ్నించారు. 2 లక్షల పైనున్న రుణాన్ని అప్పులు తెచ్చి మరి కడితే ఇప్పటి వరకు రుణమాఫీ కాలేదని తెలిపారు. సీఎం మాట నమ్మి 2 లక్షల పైనున్న రుణాలను అప్పు తెచ్చి కట్టిన రైతులకు ఇంకా రుణమాఫీ కాలేదన్నారు. ఆ రైతుల పైన మిత్తి భారం పడుతుందని.. వారికి ఏం సమాధానం చెబుతారన్నారు. వ్యవసాయ కూలీలకు 28వ తారీఖు నాడే రూ.12వేలు ఇస్తామని చెప్పి మాట తప్పారన్నారు. వ్యవసాయ కూలీలకు కోత పెట్టేందుకు వారి సంఖ్యను తగ్గించేందుకు కుట్ర జరుగుతున్నద న్నారు. రాష్ట్రం లో 54 లక్షల ఉపాధి హామీ కార్డులు ఉన్నాయని.. ఒక కోటి నాలుగు లక్షల మంది కూలీలు ఉన్నారన్నారు. ఉపాధి హామీలో పనికి వెళ్లే వారందరూ బతుకుతెరువు కోసం వెళ్లే వారేనని.. అందులో ఏరివేత ఎందుకు? అంటూ ప్రశ్నించారు. ఉపాధి హామీ పనికి వెళ్లే వారికి భూమి ఎంత ఉందో చూసి కొలిచి, వారికి ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. పొద్దున 6 గంటలకు లేచి మట్టి పనికి వెళ్లే కూలీలకు పరీక్షలా?అంటూ ప్రశ్నించారు. ఎలాంటి షరతులు లేకుండా ఉపాధి హామీ కార్డు ద్వారా పనిలోకి పోతున్న కోటి నాలుగు లక్షల మందికి సంవత్సరానికి రూ.12వేలు ఇవ్వాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తుందన్నారు. ఎకరంలోపు ఉన్న వారందరినీ వ్యవసాయ కూలీలుగా పరిగణించాల న్నారు. ఉపాధి హామీ కోసం మే నెలలో రూ.857 కోట్ల కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి వస్తే ఇప్పటివరకు రాష్ట్రంలో పనిచేసిన కూలీలకు అందించలేద న్నారు. ఆ డబ్బులను బడా కాంట్రాక్టర్లకు పర్సంటేజ్ తీసుకొని బిల్లులు చెల్లిస్తున్నారన్నారని.. ఉపాధి హామీ కూలీలకు మాత్రం డబ్బులు ఇవ్వడం లేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం డబ్బులు ఇచ్చిన మూడు నెలల్లో ఉపాధి హామీ కూలీలకు చెల్లించకపోతే మూడు నెలల తరువాత వడ్డీతో సహా చెల్లించాలని చట్టాలు చెబుతున్నాయన్నారు. ఏడు నెలలు గడిచినా.. ఇంకా ఉపాధి హామీ కూలీలకు డబ్బులు ఇవ్వలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఖాతాలో డబ్బులు వేస్తే మళ్లిస్తున్నారన్నారు. ఇప్పటి నుంచి రైతులకే నేరుగా ఉపాధి హామీ డబ్బులు వేయాలని కేంద్రం నిర్ణయించిందని వివరించారు.

# మావోయిస్టులకు ఎదురుదెబ్బ..



### ● తారక్క సహా 11 మంది లొంగుబాటు..

హైదరాబాద్-మావోయిస్ట్ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ భార్య విమల చంద్ర సిదాం అలియాస్ తారక్క.. మహారాష్ట్ర సీఎం ఎదుట బుధవా రం లొంగిపోయారు. ప్రస్తుతం ఆమె మావో యిస్ట్ పార్టీ స్పెషల్ జోనరల్ కమిటీ సభ్యురా లిగా కొనసాగుతున్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రానికి చెందిన మల్లోజుల కోటేశ్వర్ రావు, మల్లోజుల వేణుగోపాల్ అన్న దమ్ములు కాగా.. కోటేశ్వర్ రావు అలియాస్ కిషన్ జీ మావో యిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడిగా పని చేశారు. ఆయన పశ్చిమ బెంగాల్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ప్రస్తుతం వేణుగోపాల్ సెంట్రల్ కమిటీ సభ్యుడిగా కొనసాగుతున్నారు. తారక్క అలియాస్ విమల 1983లో పీపుల్స్ వార్‌లో చేరారు. ప్రస్తుతం ఆమెపై నాలుగు రాష్ట్రాల్లో 170కిపైగా కేసులు నమోదైనట్లుగా పోలీసు వర్గాలు పేర్కొన్నాయి. ఆమె తలపై రూ.కోటి వరకు రివార్డు ఉన్నది. గడ్చిరోలిలో జరిగిన కార్యక్రమంలో తారక్క మరో 11మంది మావోలతో కలిసి మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్న వీస్ ఎదుట లొంగిపోయారు. రూ.1.03కోట్ల రివార్డును సీఎం అందజేశారు. ఈ సందర్భంగా నక్సల్స్ వ్యతిరేక ఆపరేషన్‌లో ధైర్య సాహసాలు ప్రదర్శించిన సీ-60 కమాం డోలు, అధికారులను సైతం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మావోయి స్టులు ఇటీవల లొంగుబాటు నేపథ్యంలో త్వరలోనే మహారాష్ట్ర నక్సల్స్ నుంచి విముక్తి పొందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గడ్చిరోలి జిల్లాలో నక్సల్స్ కార్యకలాపాలను పోలీసులు దాదాపుగా నిర్మూ లించారన్నారు. ఉత్తర గడ్చిరోలి ప్రస్తుతం మావోయిస్టు కార్యకలాపాలకు దూరంగా ఉందని.. దక్షిణ గడ్చిరోలి త్వరలో నక్స ల్స్ నుండి విముక్తి పొందుతుందన్నారు. గత సంవత్సరాల్లో చాలా మంది భయంకరమైన నక్సల్స్‌ను నిర్మూలిం చడంతో పాటు అరెస్టు చేసినట్లు సీఎం పేర్కొ న్నారు. మావోయిస్టుల బూటకపు ఎన్‌కౌం టర్లను గ్రహించి.. నక్సల్స్ ఉద్యమానికి దూరమ వుతున్నారన్నారు. రాజ్యాంగ సంస్థల ద్వారానే తమకు న్యాయం జరుగుతుందని విశ్వసిస్తున్నారన్నారు.


## ఇ కార్ రేస్ అవినీతి వ్యవహారం

# మరో మలుపు

వివరాలు 2లో..



# ఫైనాన్స్ వేధింపులతో యువకుడి మృతి



కమలాపూర్, జనవరి 1: ఫైనాన్స్ వేధింపు లతో యువకుడు మృతి చెందిన ఘటన హ నుమకొండ జిల్లా కమలాపూర్ మం డలంలోని వంగపల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన ఆకునూరి రాకేశ్(24) ఆ ర్మాన్ ఫైనాన్స్ కంపెనీలో రూ.75 వేల అప్పు తీసుకున్నాడు. ఇందుకు నెలకు రూ. 4,350 చొప్పున 24నెలలు చెల్లించాల్సి ఉం టుంది. నాలుగు నెలలుగా కిస్తీ చెల్లించ లేదు. ఫైనా న్స్ సిబ్బంది డబ్బుల కోసం ఇంటికి వచ్చి ఇబ్బందులకు గురిచేశారు. దీంతోమానసిక ఒత్తిడికి గురైన రాకేష్‌కు మం గళవారం గుండెపోటు రావడంతో చికిత్స కోసం వరం గల్ ఎంజీఎం హాస్పిటల్‌కు తర లించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందా డు. ఫైనాన్స్ వేధింపులు తట్టు కోలేకనే తన భర్త మృతి చెందినట్లు మృతుడి భార్య వైష్ణవి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు.రాకేష్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# నేను మారాను, మీరూ మారండి..



హైదరాబాద్- నేను మారాను, మీరూ మారండి.. మంత్రులు, ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, ప్రజా సంబంధాలను మెరుగుపర్చుకోవాలని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పేందుకు ప్రజాప్రతినిధులతోపాటు అధికారులు, పార్టీ నాయకులు సీఎంను కలిశారు. తాజా రాజకీయ పరిణామాలతో ప్రభుత్వ పథకాలు పూర్తిస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లడం లేదని సీఎం రేవంత్ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఎమ్మెల్యేల పనితీరు, ప్రొగ్రెస్ రిపోర్టులు తన దగ్గర ఉన్నాయన్నారు. తన ప్రొగ్రెస్ రిపోర్టు కూడా తెప్పించానని.. అందరికీ ప్రొగ్రెస్ రిపోర్టు ఇస్తానని సీఎం రేవంత్ చెప్పారు. ప్రజలకు అందరూ అందుబాటులో ఉండాలని సూచించారు. నూతన సంవత్సరంలో సరికొత్త ఆలోచనలతో ముందుకు వెళదామన్నారు. ఏడాది పాలనలో మనకు తెలిసి ఎలాంటి తప్పు చేయలేదని.. తెలియకుండా జరిగిన తప్పులపై చరయలు తీసుకున్నామని సీఎం రేవంత్ చెప్పారు. ఏడాది పాలన అనుభవాలు.. వచ్చే నాలుగేళ్లకు ఉపయోగపడతాయ న్నారు. అంగన్‌వాడీ డీలర్ల నియామకంలో పార్టీ నాయకులకు అవకాశం ఇవ్వాలని సీఎంను ఓ మంత్రి కోరగా.. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు తీసుకుని.. పారదర్శకంగా నియా మకాలు చేయకపోతే తప్పుడు సంకేతాలు వెళతాయని సీఎం రేవంత్ చెప్పారు. ఇకపై పార్టీ నాయకులకు ఎక్కువ సమయం కేటాయిస్తానని సీఎం రేవంత్ తెలిపారు. మీరు నన్ను ఏ విధంగా అనుకుంటారో.. మిమ్మల్ని మీ కింది నాయకులు అలాగే అనుకుంటారని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికలు మనకు చాలా కీలకమని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మనం గెలిచి తీరాలని, అందుకు తగినట్లుగా ప్లాన్ చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయుల నియామకం, ప్రమోషన్లు గత ప్రభుత్వం ఎందుకు వచ్చిన లొల్లి అని చేయలేదని.. కానీ, మనం ఎవరికీ ఇబ్బంది లేకుండా జాగ్రత్తగా చేశామని తెలిపారు.

# హైదరాబాదీయులకు అలర్ట్

## ఎంఎంటీఎస్ సర్వీసులకు కొత్త టైమ్ టేబుల్



హైదరాబాద్- హైద రాబాద్ కమ్యూటర్స్ కుబిగ్‌అలర్ట్. మల్టీ మోడ ల్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్ సర్వీ సుల్లో రాకపో కలు సాగించే వారు ఇక నుంచి కొత్త టైమ్‌టేబు ల్‌ను అను సరించాల్సి ఉంటుంది. మారిన కొత్త సమయ పాలన పట్టిక నేటి నుంచి అమలులోకి వచ్చింది. ఈ మేరకు దక్షి ణ మధ్య రైల్వే అధికారు లు ఓ ప్రకటన విడుదల చేశారు. హైదరా బాద్, సికింద్రాబాద్ నుంచి వివిధ నగరాల కు వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ప్రస్తుతం రాకపో కలు సాగిస్తోన్న విషయం తెలిసిందే. ఆయా స్టేషన్లల్లో హాల్ట్ అయ్యే ఆ రైళ్ల కనెక్టివిటీకి అనుగు ణంగా ఎంఎంటీఎస్ సర్వీసుల్లో మార్పులు చేర్పులు చోటు చేసుకున్నాయి. ప్రయాణికులు వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను అందుకునేలా సవరణలు చేశారు. ఈ సవరణలు నేటి నుంచి అమలు లోకి వచ్చాయి. ప్రస్తుతం జంటనగ రాల్లో మొత్తం 88 ఎంఎంటీఎస్ సర్వీసులు అందుబాటులో ఉంటోన్నాయి. సికింద్రాబాద్- మేడ్చల్, ఫలక్‌నుమా- ఊందానగర్, ఘట్‌కేసర్- లింగంపల్లి మధ్య ఆయా సర్వీసులు రాకపోకలు సాగిస్తోన్నాయి. రోజూ మూడు లక్షలమందికి పైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. ట్రైన్ కంట్రోల్, మేనేజ్ మెంట్ వ్యవస్థ ద్వారా ఎం ఎంటీఎస్ సర్వీసులు వీటి రాకపోకలన్నీ పనిచేస్తోయి. ఫలితంగా- ఏ రైలు, ఎన్ని నిమషాలకు, ఏ స్టేషన్ కు వస్తుందనే విషయాన్ని ఖచ్చితంగా నిర్ధారించ వచ్చు. విద్యుత్‌ను పునరుత్పాదించే బ్రేకింగ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చారు. బ్రేక్ వేసినప్పుడల్లా విద్యుత్ ఆదా అయ్యేలా ఏర్పాటు చేశారు. ర్యాక్స్ లోపల, బయటి వైపు ఎల్ఈడీ ఆధారిత డిస్ ప్లే బోర్డుల ను అమర్చారు. ఎప్పటికప్పుడు స్టేషన్‌ల వివరాలు దానిపై ప్రదర్శితమవుతాయి. మెట్రో రైళ్ల తరహాలో ఆటోమేటిక్ అనౌన్స్ మెంట్ ఉంటుంది. తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో స్టేషన్ అనౌన్స్ మెంట్ ఉంటుంది.

# 926 కోట్లు తాగేసిండ్రు..



- 4 రోజుల్లో రికార్డు స్థాయిలో మద్యం అమ్మకాలు!
- 30వ తేదీన అధికంగా రూ.402 కోట్ల లిక్కర్ సేల్స్
- ఒక్క డిసెంబర్ నెలలోనే రూ.4,000 కోట్ల అమ్మకాలు

హైదరాబాద్,జనవరి1: నూతన సంవత్సరారంభం సందర్భంగా రాష్ట్రంలో జరిగిన మద్యం అమ్మకాలు ప్రభుత్వానికి కిక్కెక్కించాయి. వందల కోట్లల్లో మద్యం అమ్మకాలు జోరుగా సాగాయి. డిసెంబర్ నెలాఖరున 28 నుంచి 31 వరకు నాలుగు రోజుల్లోనే ప్రజలు ఏకంగా రూ.926 కోట్ల విలువైన మద్యం తాగేశారు. ఈ మేరకు డిసెంబర్ నెల మద్యం అమ్మకాల వివరాలను బుధవారం తెలంగాణ ఎక్సైజ్ శాఖ అధికారులు వెల్లడించా ఈ నెల చివరి రోజుల్లో 31న రూ.282 కోట్లు, 30న రూ.402 కోట్లు, 29న రూ.51 కోట్లు, 28న రూ.191 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు జరిగాయి. నూతన సంవత్సరం వేడుకల పేరిట అర్ధరాత్రిదాకా మద్యం దుకాణాలకు అనుమతులిచ్చి మందుబాబుల నుంచి భారీగా ఆర్జించినట్టు తేలింది. మద్యం అమ్మకాల ద్వారా భారీగా వచ్చిన ఆదాయాన్ని రైతు భరోసాకు ఉపయోగించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్టు తెలుస్తున్నది. నూతన సంవత్సర వేడుకలకు ప్రత్యేక అనుమతుల ద్వారా ఎక్సైజ్ శాఖకు ఈ ఏడాది భారీ ఆదాయం సమకూరింది. 31న మొత్తం 287 ఈవెంట్లకు అనుమతులు ఇచ్చారు. వీటి ద్వారా రూ.56.46 లక్షల ఆదాయం సమకూరిందని ఎక్సైజ్ శాఖ ప్రకటించింది. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోనే 243 అనుమతులు ఇచ్చినట్టు పేర్కొన్నారు. మిగతా జిల్లాల్లో 44 పర్మిషన్లు ఇచ్చినట్టు వెల్లడించారు. ఈవెంట్ అనుమతుల్లో రూ.2.50 లక్షలతో ఒకటి, రూ.లక్షతో మూడు, రూ.50 వేలతో 7 అనుమతులు ఇచ్చినట్టు చెప్పారు. నిరుడు డిసెంబర్ 31న 224 అనుమతులు ఇవ్వగా రూ.44.76 లక్షల ఆదాయం వచ్చినట్టు తెలిపారు.

# రాష్ట్రంలో విచ్చలవిడిగా నకిలీ మందులు

- 2023తో పోల్చితే నిరుడు రెట్టింపు
- జ్వరం నుంచి క్యాన్సర్ వరకు అన్నీ నకిలీలే
- ఉనికిలో లేని కంపెనీల పేరుతో తయారు

హైదరాబాద్,జనవరి1 : రాష్ట్రంలో నకిలీ ఔషధాల తయారీ, సరఫరా విచ్చలవిడిగా జరుగుతున్నది. నిరుటితో పోల్చితే నకిలీ ఔషధాలు రెట్టింపైనట్టు డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) తాజాగా విడుదల చేసిన నివేదిక స్పష్టం చేస్తున్నది. సాధారణ జ్వరానికి వాడే పారాసిటమాల్ మొదలుకొని క్యాన్సర్ చికిత్సకు ఉపయోగించే మందుల వరకు నకిలీలు పట్టుబడుతున్నట్టు వెల్లడించింది. 2023లో పరీక్షించిన 4,553 నమూనాల్లో 79 (1.73 శాతం), నిరుడు పరీక్షించిన 3,902 శాంపిళ్లలో 130 (3.33 శాతం) నకిలీవని తేల్చింది. 2024లో పట్టుబడిన నకిలీ ఔషధాలను పరిశీలిస్తే.. అక్రమార్కులు అన్ని రకాల మందులను కల్తీ చేస్తున్నట్టు స్పష్టమవుతున్నది. కొందరు ఉనికిలో లేని కంపెనీల పేర్లతో, మరికొందరు పేరున్న కంపెనీల పేరుతో నకిలీ ఔషధాలను మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నారు. మరికొందరు ఇతర రాష్ట్రాల్లో తయారైన నకిలీ ఔషధాలను తెలంగాణలోకి తీసుకొచ్చి అమ్ముతున్నట్టు తేలింది. హైదరాబాద్‌లోని మచ్చబొల్లారంలో డీసీఏ జరిపిన దాడుల్లో 'ఆస్ట్రా జెనరిక్స్' అనే కంపెనీ పేరుతో నకిలీ ఔషధాలు తయారు చేస్తున్నట్టు తేలింది. అసలు ఈ కంపెనీ మనుగడలోనే లేదని అధికారులు గుర్తించారు. వీళ్లు క్యాన్సర్ చికిత్సలో వాడే ఔషధాలకు నకిలీ తయారుచేసి అమ్ముతున్నట్టు నిర్ధారించారు. జూలైలో దూలపల్లిలో నిర్వహించిన దాడుల్లో 'అబాట్' సంస్థ పేరుతో నకిలీ ఔషధాలు తయారు చేస్తున్నట్టు గుర్తించారు.ఇందులో పారసిటమాల్ గోలీలు కూడా ఉన్నాయి. సిద్దిపేట జిల్లా కరకపట్లలోని బయోటెక్ పార్క్‌లో ఇతర కంపెనీల పేరిట యాంటీ బయాటిక్స్ తయారు చేసి, విదేశాలకు ఎగుమతి చేస్తున్న ముఠా గుట్టును అధికారులు రట్టు చేసి, దాదాపు రూ.కోటిన్నర విలువైన మందులు సీజ్ చేశారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో విచ్చలవిడిగా నకిలీ మందులు తయారవుతున్నాయని, గతేడాది మొత్తంగా రూ.11.32 కోట్ల విలువైన నకిలీ ఔషధాలను సీజ్ చేశామని డీసీఏ వెల్లడించింది. కొందరు మెడికల్ షాపుల యజమానులు, ఆర్ఎంపీలు, డాక్టర్లు కాసుల కక్కుర్తితో రోగులకు నకిలీ ఔషధాలను అమ్ముతున్నట్టు డీసీఏ తనిఖీల్లో తేలింది. ఈ నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, మందుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే కొనుగోలు చేయాలని అధికారులు సూచిస్తున్నారు. నకిలీ ఔషధాలను గుర్తిస్తే 180059 96969 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు.

# శ్రీశైలం విద్యుత్తు కేంద్రంలో లీకేజీ..

## ఒకటో యూనిట్ వద్ద నీటిధారలు

## ప్రమాదం లేదన్న ప్రాజెక్టు సీఈ

అచ్చంపేట, జనవరి 1: నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని శ్రీశైలం ఎడమగట్టు జల విద్యుత్తు కేంద్రం వద్ద వారం రోజులుగా నీరు లీక్ అవుతున్నది. యూనిట్-1 జీరో ఫ్లోర్ డ్రాఫ్ట్ ట్యూబ్ నుంచి నీటి ధార పడుతున్నది. ఈ విషయాన్ని గత నెల 25న షిఫ్ట్ అధికారులు గుర్తించి పైఅధికారులకు సమాచారమిచ్చారు. దీంతో జెన్‌కో అధికారులు పరిశీలించి ఉన్నతాధికారులకు వివరించగా.. హైదరాబాద్ విద్యుత్తు సౌధ నుంచి జనరల్ సర్వీసెస్ సివిల్ సీఈ హైడల్ నారాయణ వచ్చి పరిశీలించారు. లీకేజీకి సంబంధించి నివేదిక ఇవ్వాలని ఇంజినీర్లను ఆదేశించి.. లీకేజీని ఎప్పటికప్పుడు పరిశీలించేందుకు సీసీ కెమెరా ఏర్పాటు చేశారు. అయితే రివర్స్ విద్యుత్తు ఉత్పత్తి చేయడంతో వైబ్రేషన్ కారణంగా నీటి ఒత్తిడి పెరిగి లోపల ఉన్న పైపు వెల్డింగ్ నుంచి లీకేజీ కొనసాగుతున్నట్టు అధికారులు భావిస్తున్నారు. సర్జిచాంబర్, పెన్‌స్టాక్ గేట్లను మూసివేసి, టర్బయిన్‌లో నిల్వ ఉండే నీటిని పూర్తిగా తొలగించి లోపలికి వెళ్లి పరిశీలించాల్సి ఉంటుంది.నాగార్జున సాగర్‌లో వాటర్ లెవల్ తగ్గితేనే పరిశీలించే అవకాశం ఉన్నదని ఎస్ఈ (సివిల్) రవీంద్రకుమార్ తెలిపారు. ప్రస్తుతానికి ప్రమాదమేమీ లేదని, కాంక్రీట్‌కు వెల్డింగ్ చేస్తే సరిపోతుందని పేర్కొన్నారు. చిన్న నీటిధారతో ఎలాంటి ప్రమాదం లేదని, రివర్స్ పంపింగ్ విద్యుత్తు ఉత్పత్తిని నిలిపివేశామని సీఈ రామసుబ్బారెడ్డి తెలిపారు.

# క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయి

- పటేల్ క్రికెట్ లీగ్ పోటీల పోస్టర్ ను ఆవిష్కరించిన ప్రభుత్వ విప్



బలగం టీవీ, వేములవాడ : క్రీడలు యువతలో సానుకూల ఉత్సాహాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని ప్రభుత్వవిప్ అది శ్రీనివాస్ అన్నా రు.బుధవారం మున్నూరు కాపు జర్నలిస్ట్ ఫోరం పటేల్ యూత్ ఫోర్సు ఆధ్వర్యంలో నిర్వహించనున్న పటేల్ క్రికెట్ లీగ్ పోటీల పోస్ట ర్‌ను ప్రభుత్వ విప్ వేములవాడ నియోజకవర్గ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ టోర్నమెంట్ యువకుల ప్రతిభను వెలికితీయటానికి వేదికగా నిలుస్తుంది అని పేర్కొన్నారు.మున్నూరు కాపు జర్నలిస్టు ఫో రం, పటేల్ యూత్ ఫోర్స్ వ్యవస్థాపక అధ్యక్షులు కొత్త లక్ష్మణ్ పటేల్ మాట్లాడుతూ మాట్లాడుతూ, మున్నూరు కాపు జర్నలిస్టు ఫోరం ,పటేల్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో ఈ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించబ డుతోందన్నారు.ఈ పోటీలు క్రీడాభివృద్ధికి తోడ్పాటుగా, యువతలో ఐక్యతను పెంపొందించడమే లక్ష్యంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జనవరి 10, 11, 12 తేదీలలో కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ఆర్ కళాశాల గ్రౌండ్ లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ టోర్నమెంట్‌లో పాల్గొనే విజేతలకు నగదు బహుమతులు ఉన్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమం లో మున్నూరు కాపు జర్నలిస్టు ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు నూగురి మహేష్ పటేల్,కరీంనగర్ మున్నూరు కాపు జర్నలిస్ట్ ఫోరం జిల్లా అధ్యక్షులు వేల్పుల శ్రీనివాస పటేల్, జగిత్యాల జిల్లా అధ్యక్షులు వంగల రమేష్ పటేల్, ప్రధాన కార్యదర్శి ఎర్రంచందు పటేల్, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు రాచర్ల రాజు పటేల్, కూసం రాజు పటేల్, నియోజకవర్గ నాయకులు సోయినేని కరుణాకర్ పటేల్, చిలుక సంతోష పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న భక్తులకు మెరుగైన వసతులు కల్పించడమే ప్రభుత్వా లక్ష్యం


## ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



బలగం టీవీ, వేములవాడ :దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి సన్నిధికి వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని ఆది శ్రీనివాస్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం ఆలయ అర్చకులు వారికి ఆశీర్వచనం గావించగా, ఈ.ఓ వినోద్ రెడ్డి శాలువాతో సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ శ్రీ పార్వతీ-పరమేశ్వరుల ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, పాడి పంట లతో రైతులు విరాజిల్లాలని రాజన్నను దర్శించుకుని వేడుకోవడం జరిగిందని అన్నారు.కోడెను కడితే కోరిన కోరికలు తీర్చే దేవుడిగా ప్రసిద్ధిగాంచిన రాజన్న ఆశీస్సులతో ఆలయ అభివృద్ధితో పాటు పట్టణ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కొలువు దీరిన వెంటనే రూ.127కోట్లతో పనులకు శ్రీకారం చుట్టామని, పనుల్లో ఎలాంటి అవంతరాలు చోటు చేసుకోకుండా త్వరగా పూర్తయి భక్తులకు మెరుగైన వసతులు కలిగేలా చూడాలని స్వామివారితో పాటు అమ్మవారిని ప్రత్యేకంగా వేడుకున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

# సంవత్సరం మొత్తంలో ఒక్క క్యాజువల్ లీవ్ తీసుకోలే

- ప్రత్యేకత చాటుకున్న హెడ్మాస్టర్ శ్రీనివాస్
- సోషల్ మీడియా వేదికగా హెచ్ఎం ప్రకటన
- నెటిజన్‌ల నుంచి వెల్లువెత్తుతున్న అభినందనలు
- గతంలోనూ ఆదర్శ ఉపాధ్యాయుడుగా రాష్ట్ర స్థాయి పురస్కారం అందుకున్న శ్రీనివాస్



బలగంటీవీ , సిరిసిల్ల : సిరిసిల్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమగ్రాభివృద్ధి ధ్యేయంగా కృషి చేస్తున్న హెడ్మాస్టర్ చకినాల శ్రీనివాస్ అరుదైన ఘనత సాధిం చారు.2024 సంవత్సరం మొత్తంలో ఒక్క క్యాజువల్ లీవ్ వాడుకోకుండా ఉపాధ్యాయలోకానికి స్పూరిగా నిలిచారు.సంవత్సరంలో వేతనంలో ఎలాంటి కోతలు లేకుండా 15 రోజులను సాధారణ సెలవులు వాడుకోవచ్చు,అవకాశం ఉన్నప్పటికీ తను సాధారణ సెల వులు వాడుకోలేదు. సిరిసిల్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోతాను స్కూల్ హెచ్ఎం గా బాధ్యతలు చేపట్టే నాటికి 40-50 మంది పిల్లలు మాత్రమే ఉండేవారు. సామర్థ్యం కంటే తక్కువ మంది పిల్లలతో ఉన్న స్కూల్ లో ప్రవేశాలు పెంచేందుకు కంకణం కట్టుకున్న శ్రీనివాస్,మొదట విద్యా బోధనను మెరుగు పరిచారు,షెడ్యూల్ ప్రకారం పాఠాలు జరిగేలా పర్యవేక్షణ,కంప్యూటర్ ల్యాబ్ ను ఏర్పాటు, వేసవిలో ఆంగ్లం లో నైపుణ్యాలు పెంపుదలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటుకు చొరవ తీసుకున్నారు.పాఠ్యేతర కార్యక్రమాలలో కూడా విద్యార్థులు చురుగ్గా పాల్గొనే చేశాడు. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేలా విద్యార్థులను ప్రోత్సహించారు. ఇలాంటి కార్యక్ర మాలతో క్రమంగా విద్యార్థుల తల్లిదండ్రులకు పాఠశాలపై నమ్మకం పెరగడంతో స్కూల్ లో ప్రవేశాల సంఖ్య గణనీయంగా పెరిగి, 260 కి పైగా విద్యార్థుల ప్రవేశాలు జరిగాయి. పాఠశాల సమగ్రాభివృద్ధి చేసిన కృషికి గుర్తింపుగా హెచ్ఎం చకినాల శ్రీనివాస్ కు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయునిగా పురస్కారం లభించింది. ఇంతటితో ఆగకుండా శ్రీనివాస్ పూర్వ విద్యార్థుల సహకారంతో పాఠశాలలోని విద్యార్థులకు సైకిల్‌లు,బ్యాగ్‌లుఅందజేశారు. త్రాగునీటి వసతి, తదితర మౌలిక సదుపాయాల పెంపుదలకు కృషి చేశారు.

# ప్రెస్ క్లబ్ నూతన పాలకవర్గాన్ని సన్మానించిన బిజెపి నాయకులు



బలగంటీవీ,తంగళ్లపల్లి తంగళ్లపల్లి మండల ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని బిజెపి మండల అధ్యక్షులు వెన్నమనేని శ్రీధర్ రావు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు గూడూరి భాస్కర్,ఇటికల రాజు , కోస్ని వినయ్,కన్నె అరుణ్, శ్రీను, బొలిగం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# మాకు విదేశీ నిపుణులు అక్కర్లేదు!

## హెచ్1బీ వీసాపై అమెరికన్ల మనోగతం




వాషింగ్టన్,జనవరి 1: అగ్రరాజ్యం అమెరికాలో హెచ్-1బీ వీసాలపై అటు రాజకీయ నేతల్లో, ఇటు పౌర వర్గాల్లో జోరుగా చర్చ సాగుతున్నది. వాస్తవానికి హెచ్-1బీ వీసా ద్వారా విదేశీయులను రప్పించాల్సిన స్థితిలో అమెరికా లేదని ఆ దేశానికి చెందిన మెజార్టీ ప్రజలు అభిప్రాయపడుతున్నారు. తక్కువ స్థాయిలో నైపుణ్యం గల గ్రాడ్యుయేట్లను అమెరికా తయారు చేస్తున్నదన్న వాదనను వారు కొట్టిపారేస్తున్నారు. రాస్ముసేన్ అనే సంస్థ తాజా నివేదిక ప్రకారం వైట్ కాలర్ ఉద్యోగాలకు శిక్షణ ఇవ్వడానికి, నియమించడానికి నిపుణులైన ఉద్యోగులు, కార్మికులు ఇప్పటికే దేశంలో తగినంత మంది ఉన్నారని, కొత్తగా నిపుణులైన విదేశీయు లను రప్పించాల్సిన అవసరం లేదని మెజార్టీ అమెరికన్లు స్పష్టం చేస్తున్నారు. ఇటీవల జరిపిన ఈ సర్వేలో అధిక శాతం హెచ్-1బీ వీసా కార్యక్రమాన్ని విస్తృతం చేయాల్సిన అవసరం లేదని తెగేసి చెప్పారు. ఇప్పటికే అమెరికా కావల్సినంత మంది నిపుణులను కలిగి ఉందని 60 శాతం పౌరులు అభిప్రాయపడ్డారు. కొత్తగా విదేశాల నుంచి రప్పించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ దృక్పథం రిపబ్లికన్లలో బలంగా ఉంది. 65 శాతం స్వింగ్ ఓటర్లు, 47 శాతం డెమోక్రాట్లు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేయగా, 26 శాతం మాత్రమే కొత్త నైపుణ్యాన్ని తీసుకురావాలని పేర్కొన్నారు. అమెరికాలో ప్రధాన కంపెనీలైన అమెజాన్, గూగుల్, టెస్లాల్లో ప్రధాన ఉద్యోగాల్లో నియామకానికి ఈ హెచ్-1బీపైనే ఎక్కువగా ఆధారపడి ఉన్నాయి. స్థానికంగా తమకు సరిపడా నిపుణులైన సిబ్బంది లభ్యం కావడం లేదని, తమ సంస్థలు పూర్తి స్థాయిలో పనిచేయాలంటే విదేశాల నుంచి రప్పించే వారిపైనే ఆధారపడక తప్పదని, కార్మిక అంతరాలను ఈ విధానం పూరిస్తుందని ఇవి పేర్కొంటున్నాయి. అయితే వీరి కారణంగా స్థానికులైన అమెరికన్లు వేతన అణచివేతకు గురవుతున్నారని, చవకగా వచ్చే నిపుణుల కారణంగా వారి ఉపాధి అవకాశాలు దెబ్బతినడమేకాక, శ్రమదోపిడీకి గురవుతున్నారని మరికొందరు వాదిస్తున్నారు. అమెరికాలోని కంపెనీలలో పనిచేయడానికి నిపుణులైన విదేశీ కార్మికులు, ఉద్యోగులను కంపెనీలు రప్పించుకునేందుకు హెచ్-1బీ వీసాలను ప్రభుత్వం జారీ చేస్తుంది. దీని కారణంగా భారత్, చైనా లాంటి దేశాల్లోని నిపుణులకు మంచి అవకాశాలు లభిస్తున్నాయి. ఇటీవల అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ గెలవడంతో ఈ వీసాల సంఖ్య తగ్గిస్తారని తొలుత ప్రచారం జరిగినా తన ముఖ్య సలహాదారులు, డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియన్సీ (డీఓజీఈ) సంయుక్త సారథులుగా నియమితులైన ఎలాన్ మస్క్, వివేక్ రామస్వామి లాంటి వారు ఈ వీసా విధానానికి మద్దతు ఇచ్చారు. టాలెంట్ ఎక్కడున్నా ప్రోత్సహించాలన్నది వారి వాదన. తర్వాత ట్రంప్ సైతం వారికి మద్దతుగా గళం కలిపారు. తాను ఎల్లప్పుడూ ఈ వీసా విధానానికి అనుకూలమేనని ప్రకటించారు. దీంతో ట్రంప్ పార్టీలోనే దీనిపై భేదాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

# బోనులో చిక్కిన పెద్దపులి..

## ఊపిరి పీల్చుకున్న ఉమ్మడి ఆదిలాబాద్

కుమ్రంభీం ఆసిఫాబాద్, జనవరి 1 : కొన్ని నెలలుగా కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టీ)-మహారాష్ట్ర సరిహద్దుల్లో సంచరిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్న పెద్దపులిని ఎట్టకేలకు మంగళవారం రాత్రి చంద్రాపూర్ అటవీ అధికారులు బోనులో బంధించారు. ఈ పులిని పట్టుకునేందుకు మహారాష్ట్ర అటవీ అధికారులు వారం రోజులుగా ప్రయత్నిస్తున్నారు. సిర్పూర్(టీ) మండలం-మహారాష్ట్రలోని సరిహద్దు గ్రామమైన అంతర్గాం అటవీ ప్రాంతంలో మగ పులికి మత్తుమందు ఇచ్చి బోనులో బంధించి ఆపై చంద్రాపూర్‌కు తరలించినట్టు తెలిసింది. పులికి అవసరమైన వైద్యసేవలు అందించిన తర్వాత తడోబా పులుల సంరక్షణ కేంద్రంలో వదిలివేయను న్నట్టు సమాచారం. దాదాపు రెండు నెలలుగా కౌటాల, సిర్పూర్(టీ) మండలాల్లోని మహారాష్ట్ర సరిహద్దు గ్రామాల్లో సంచరిస్తున్న పులి వేటగాళ్ల బారిన పడే ప్రమాదం ఉండటంతో చంద్రాపూర్ అటవీ అధికారులు అప్రమత్తమై పులిని బోనులో బంధించారు. ఈ విషయమై ఆసిఫాబాద్ జిల్లా అటవీ అధికారులు స్పష్టత ఇవ్వలేకపోతున్నారు. పులులను రక్షించేందుకు తీసుకోవాల్సిన చర్యల్లో భాగంగా ఈ విషయాన్ని గోప్యంగా ఉంచుతున్నట్టు తెలుస్తున్నది. సరిహద్దు గ్రామాల్లో ఇద్దరిపై దాడి చేసిఒకరి ప్రాణాలుతీసి మ్యాన్ ఈటర్‌గా మారిన పులిని ఎట్టకేలకు పట్టుకోవడంతో ఇటు అధికారులు.. అటు ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. గత నవంబర్ 29న కాగజ్‌నగర్ మండలం గన్నారం సమీపంలో పత్తి చేనుల్లో పనిచేస్తున్న లక్ష్మిపై దాడిచేయడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మరుసటి రోజు సిర్పూర్(టీ) సమీపంలోని పత్తిచేనులో పని చేసుకుంటున్న రైతు సురేశ్‌పై దాడిచేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. రెండు నెలల కాలంలో అక్కడక్కడ సంచరిస్తూ తరచూ పశువులపై దాడి చేసింది.

# ఉప్పల్ మున్సిపల్ స్టేడియంలో మందు పార్టీ..

## గ్రౌండ్ మొత్తం మందుసీసాలు, ఆహారవ్యర్థాలే..!



హైదరాబాద్, జనవరి 1 : క్రీడా మైదానాలను పార్టీలకు ఇవ్వబోమంటూ సీఎం రేవంత్‌రెడ్డి గతంలో చెప్పిన మాట ఆచరణలో మాత్రం అటకెక్కింది. న్యూ ఇయర్ వేడుకల్లో భాగంగా ఉప్పల్ మున్సిపల్ స్టేడియం మందు పార్టీకి వేదికైంది. బుధవారం ఉదయానికల్లా స్టేడి యం మొత్తం మద్యం బాటిళ్లతో డంపింగ్‌యార్డ్‌లా దర్శనమిచ్చింది. ఉదయం స్టేడియానికి వచ్చిన వాక ర్స్ పరిస్థితి చూసి షాక్ అయ్యారు. స్టేడియంలో కాక్‌టైల్ పార్టీ నిర్వహించడంపై మండిపడుతున్నారు. అసలు అనుమతు లు ఎలా ఇచ్చారంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రభుత్వ తీరును దు య్యబట్టారు. క్రీడా మైదానాన్ని లిక్కర్ పార్టీకి ఇచ్చిన ఘనత రేవంత్ సర్కారుకే దక్కుతుందంటూ ఎద్దేవా చేశారు. దీనిపై సోషల్ మీడియాలో ఉదయం నుంచి జోరుగా చర్చ సాగుతున్నది. ఉప్పల్ మున్సిపల్ స్టేడి యం ఫొటోలను షేర్ చేస్తూ ట్రోల్స్ చేస్తున్నారు. గతంలో సీఎం రేవం త్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను వీటికి జోడించి నెటిజన్లు ఆగ్రహం వ్యక్తంచేస్తు న్నారు. అద్దె కోసం కక్కుర్తిపడి ఇలా లిక్కర్ పార్టీకి ఇస్తారా అంటూ ప్రశ్నిస్తున్నారు.

## 'వార్-2' సర్‌ప్రైజ్ చేయబోతున్న ఎన్టీఆర్..?



మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ ప్రస్తుతం బాలీవుడ్‌లో తెరకెక్కుతున్న 'వార్-2' మూవీతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నాడు. దర్శకుడు అయాన్ ముఖర్జీ తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్ కూడా నటిస్తుండటంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో సాలిడ్ అంచనాలు నెలకొన్నాయి.ఇక ఈ సినిమాలో తారక్ ఎలాంటి పాత్రలో నటిస్తారా అని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. అయితే, తాజాగా ఈ సినిమాలో తారక్ పాత్రకు సంబంధించిన ఓ ఇంట్రెస్టింగ్ వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. 'వార్-2' మూవీలో ఎన్టీఆర్ రెండు వైవిధ్యమైన షేడ్స్ ఉన్న పాత్రలో నటిస్తున్నాడని.. ఆయన పర్ఫార్మెన్స్ ఈ సినిమాకే హైలైట్‌గా నిలవనుందని..ముఖ్యంగాహృతిక్ రోషన్‌తో ఎన్టీఆర్ సీన్స్ నెక్స్ట్ లెవెల్‌లో ఉండబోతున్నాయని తెలుస్తోంది.'వార్-2' మూవీలో ఎన్టీఆర్ రోల్‌పై వస్తున్న వార్తలతో అభిమానులు ఈ సినిమాలో తమ అభిమాన హీరోఎలాంటి పర్ఫార్మెన్స్ ఇస్తాడా అని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. మరి నిజంగానే ఈ సినిమాలోఎన్టీఆర్‌రెండు వైవిధ్యమైనషేడ్స్ ఉన్న పాత్రల్లో నటిస్తాడా లేదా అనేది వేచి చూడాలి.

## 'విడుదల 2' ఓటీటీ డేట్ లాక్..?




తమిళ వెర్సటైల్ యాక్టర్ విజయ్ సేతుపతి, సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ వెట్రీమారన్ కాంబినేషన్‌లో తెరకెక్కిన 'విడుదల 2' ఇటీవల రిలీజ్ అయ్యి బాక్సాఫీస్ దగ్గర మంచి టాక్ తెచ్చుకుంది. ఈ సినిమాలోని రస్టిక్ స్టోరి ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇక వెట్రిమారన్ మార్క్ కథనం ఈ సినిమాకు ప్లస్ పాయింట్‌గా నిలిచింది. ఇక తమిళ్‌తో పాటు తెలుగులోనూ ఈ సినిమాకు మంచి రెస్పాన్స్ రావడంతో ఇప్పుడు ఈ సినిమా ఓటీటీ స్ట్రీమింగ్‌కు సిద్ధమైంది.ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ జీ5 'విడుదల 2' చిత్ర ఓటీటీ స్ట్రీమింగ్ రైట్స్‌ను దక్కించుకుంది. అయితే, ఇప్పుడు ఈ చిత్రాన్ని జనవరి 17 నుంచి ఓటీటీ స్ట్రీమింగ్ చేయాలని జీ5 ప్లాన్ చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. తమిళ్‌తో పాటు తెలుగులోనూ ఈ చిత్రాన్ని ఒకేరోజున ఓటీటీ స్ట్రీమింగ్‌కు తీసుకొచ్చేందుకు జీ5 సిద్ధమవుతోందట. సంక్రాంతి సినిమాల హడావుడి పూర్తవగానే ఓటీటీలో ఈ సినిమా సందడి చేసేందుకు సిద్ధమవుతోంది.ఇక ఈ సినిమాలో మంజూ వారియర్ హీరోయిన్‌గా నటించగా సూరి, గౌతమ్ వాసుదేవ్ మీనన్, భవాని శ్రీ తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటించారు. మరి ఈ సినిమాను నిజంగానే జనవరి 17న ఓటీటీ స్ట్రీమింగ్‌కు తీసుకొస్తారా లేదా అనేది చూడాలి.



## అభిమానులకు రాఖీ భాయ్ లెటర్.. ఎందుకంటే?

కన్నడ హీరో యశ్ ప్రస్తుతం తన నెక్స్ట్ చిత్రం 'టాక్సిక్'ను తెరకెక్కిస్తున్నాడు. 'కేజీయఫ్' చిత్రాలతో పాన్ ఇండియా స్టార్ గా యశ్ తనకంటూ ప్రత్యేక ఇమేజ్‌ను తెచ్చుకున్నాడు. ఇక ఇప్పుడు మరోసారి 'టాక్సిక్' చిత్రంతో ప్రేక్షకులను ఆకట్టు కునేందుకు రెడీ అవుతున్నాడు.అయితే, తాజాగా యశ్ తన అభిమానులకు ఓ ఓపెన్ లెటర్ రాశాడు. 'తన అభిమానులు తనపై కురిపిస్తున్న ప్రేమకు ఎల్లప్పుడు కృతజ్ఞుడిని. గత కొన్నేళ్లుగా అభిమానులు తన పుట్టినరోజును గ్రాండ్‌గా సెలబ్రేట్ చేయాలని చూస్తున్నారు. కానీ, కొన్ని అనుకోని ఘటనలను తనను కలిచివేశాయి.. అందుకే తాను ఇలాంటి వేడుకలకు దూరంగా ఉంటున్నానని.. ఇకపై కూడా తన అభిమానుల క్షేమమే తనకు ముఖ్యమని.. తన పుట్టిన రోజున తాను సినిమా షూటింగ్‌లో బిజీగా ఉంటానని..' యశ్ తన లేఖలో పేర్కొన్నాడు.అభిమానులు అందించే విషెస్ తనకు ఎల్లప్పుడు చేరుతాయని.. అవి మాత్రమే తనకు సంతోషాన్నిస్తాయని యశ్ ఈ సందర్భంగా తెలిపాడు.

## 2024 పాపులర్ ఇండియన్ ఫిల్మ్‌గా 'కల్కి 2898 ఎడి'



మరికొద్ది గంటల్లో నూతన సంవత్సరంలోకి అడుగుపెడుతున్నాం. 2024 ఎన్నో జ్ఞాపకాలను టాలీవుడ్ అభిమానులకు మిగిల్చింది. ఈ ఏడాదిలో రిలీజ్ అయిన కొన్ని సినిమాలు తెలుగు సినిమా సత్తాను యావత్ ప్రపంచానికి చాటి చెప్పాయి. వాటిలో రెబల్ స్టార్ ప్రభాస్ నటించిన సైఫై మైథలాజికల్ మూవీ 'కల్కి 2898 ఎడి' కూడా ఒకటి. దర్శకుడు నాగ్ అశ్విన్ డైరెక్ట్ చేసిన ఈ విజువల్ వండర్ బాక్సాఫీస్ రికార్డులను తిరగరాసింది.ఇక ఈ సినిమా ఇప్పుడు మరోసారి తన ప్రత్యేకతను చాటుకుంది. ప్రముఖ ఫిల్మ్ రేటింగ్ సంస్థ ఐఎండీబీ 2024 మోస్ట్ పాపులర్ ఇండియన్ చిత్రాల జాబితాలో 'కల్కి 2898 ఎడి' నెంబర్ వన్ స్థానంతో టాప్ ప్లేస్‌లో నిలిచింది. ఈ సినిమాలోని కథ, విజువల్‌గా ప్రేక్షకులకు అందించిన ట్రీట్ ఈ చిత్రాన్ని ఇతర చిత్రాలతో ప్రత్యేకంగా చేశాయి. ఇక ఈ సినిమాలోని భారీ క్యాస్టింగ్ కూడా ఓ కారణంగా చెప్పవచ్చు.ప్రభాస్‌తో పాటు ఈ సినిమాలో బిగ్ బి అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకొనె, దిశా పటాని తదితరులు నటించారు. ఈ చిత్రానికి సంతోష్ నారాయణన్ సంగీతం అందించగా వైజయంతి మూవీస్ అత్యంత భారీ బడ్జెట్‌తో ప్రొడ్యూస్ చేశారు.

## 'ఎన్టీఆర్-నెల్సన్' సినిమా పై క్లారిటీ ఇదే !




మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ డైరెక్టర్ నెల్సన్ కలయికలో సినిమా రాబోతుంది అనగానే.. ఈ సినిమా పై భారీగా బజ్ పెరిగింది. పైగా ఇప్పటికే ఈ సినిమా పై ఎన్నో రూమర్స్ వైరల్ అవుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ సినిమా నిర్మాత నాగవంశీ తన తాజా ఇంటర్వ్యూలో క్లారిటీ ఇచ్చారు. 'నెల్సన్-ఎన్టీఆర్ సినిమా కథ పై ఇంకా ఎలాంటి క్లారిటీ లేదని.. కేవలం ఎన్టీఆర్ గారితో సినిమా చేయాలని నెల్సన్, మేం ఓ మాట అనుకున్నాం అని, హీరోగారితో నెల్సన్ కి ఒక మీటింగ్ మాత్రమే జరిగింది' అని ఆయన చెప్పారు. ప్రస్తుతం నెల్సన్ కథను రాస్తున్నారని.. 'వార్ 2' పూర్తి అయ్యాక, ఎన్టీఆర్ కి నెల్సన్ కథ చెబుతారని.. కథ నచ్చాక, షూటింగ్ గురించి, ఆ సినిమాని ఎలా లాంచ్ చేయాలి, ఏ రేంజ్ లో ప్లాన్ చేయాలి వంటి అంశాల గురించి ఆలోచిస్తాం అని నాగవంశీ చెప్పుకొచ్చారు. తమిళంలో బీస్ట్, జైలర్ వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలను తెరకెక్కించిన నెల్సన్, ఎన్టీఆర్ తో సినిమా చేస్తే మాత్రం ఫ్యాన్స్ కి ఫుల్ జోషే. మరి ఈ కాంబినేషన్ ఎప్పుడు సెట్స్ పైకి వెళ్తుందో చూడాలి. ప్రస్తుతం తారక్ 'వార్-2' మూవీ షూటింగ్ లో బిజీగా ఉన్నాడు.

## రోహిత్‌శెట్టి సూపర్‌కాప్ ఫిల్మ్



బాలీవుడ్‌లో పోలీస్ కథలను తెరకెక్కించడంలో సిద్ధహస్తుడిగా పేరు తెచ్చుకున్నారు దర్శకుడు రోహిత్‌శెట్టి. 'కాప్ యూనివర్స్'లో భాగంగా ఆయన తీసిన 'సింగం' సిరీస్ చిత్రాలు పాపులర్ అయ్యాయి. ఈ నేపథ్యంలో ఆయన మరో సూపర్‌కాప్ చిత్రానికి సిద్ధమవుతున్నారు. తనకు అత్యంత సన్నిహితుడు అయిన ముంబయి మాజీ జాయింట్ పోలీస్ కమిషనర్ రాకేష్ మారియా జీవిత కథ ఆధారంగా ఓ సినిమాను తెరకెక్కించబోతున్నారు. రోహిత్‌శెట్టి రూపొందించిన కాప్ యూనివర్స్ చిత్రాల పరిశోధన, సమాచార సేకరణ విషయంలో రాకేష్ మారియా ఎంతో సహాయాన్ని అందించారు. ఆయన ఇచ్చిన ఇన్‌పుట్స్‌తోనే తాను పోలీస్ కథలను అద్భుతంగా తీయగలిగానని రోహిత్‌శెట్టి అనేక సందర్భాల్లో తెలిపారు. ఈ నేపథ్యంలో పవర్‌ఫుల్ పోలీస్ అధికారిగా పేరున్న రాకేష్ మారియా జీవిత కథ ఆధారంగా సినిమా రాబోతుండటం ఆసక్తికరంగా మారింది. ఈ సినిమాలో జాన్‌అబ్రహామ్ హీరోగా నటించనున్నారు. ఈ చిత్రం వేసవిలో సెట్స్‌మీదకు వెళ్లనుంది.

## 'ఓజీ'పై పవన్ కామెంట్స్ వైరల్.. ఏమన్నారంటే?



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ప్రస్తుతం ఏపీ రాష్ట్ర డిప్యూటీ సీఎంగా ఎంత బిజీగా ఉన్నారో మనకు తెలిసిందే. అయితే, ఆయన అభిమానులు మాత్రం ఆయన నుంచి నెక్స్ట్ చిత్రం ఎప్పుడెప్పుడు వస్తుందా అని ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే పవన్ తన నెక్స్ట్ చిత్రాలు ఓజీ, హరిహర వీరమల్లు, ఉస్తాద్ భగత్ సింగ్ షూటింగ్‌లు జరుపుకుంటున్న సంగతి తెలిసిందే.అయితే, తాజాగా తన చిత్రాలు ఆలస్యం కావడానికి గల కారణాన్ని పవన్ తెలిపారు. తాను రాజకీయాల్లో బిజీ కాకముందే తన చిత్రాల కోసం డేట్స్ కేటాయించానని.. అయితే, ఆయా చిత్ర యూనిట్ వాటిని ఉపయోగించుకోలేక పోయారని పవన్ తెలిపారు. అంతేగాక, ప్రస్తుతం కొద్ది రోజుల షూటింగ్ మాత్రమే పెండింగ్ ఉందని.. హరిహర వీరమల్లు 8 రోజుల షూటింగ్.. ఓజి కూడా త్వరగానే పూర్తవుతుందని పవన్ తెలిపారు.ఇక తన అభిమానులు ఎక్కడికి వెళ్లినా 'ఓజి.. ఓజి" అని కేకలు వేస్తున్నారని.. అయితే అవి అరుపులుగా కాదు బెదిరింపులుగా వినిపిస్తున్నాయని పవన్ అన్నారు. దీంతో పవన్ తన నెక్స్ట్ చిత్రాలకు సంబంధించి సాలిడ్ అప్డేట్ అయితే ఇచ్చాడని అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇక పవన్ నుంచి రాబోయే నెక్స్ట్ మూవీ 'హరిహర వీరమల్లు' అనేది కన్ఫర్మ్ అయ్యింది.

## సిద్ధు జొన్నలగడ్డతో 'అర్జున్ రెడ్డి లాంటి' సినిమా ?

స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ, ప్రముఖ నిర్మాత నాగవంశీ కలయికలో ఆల్రెడీ 'డీజే టిల్లు', 'డీజే టిల్లు 2' వంటి రెండు సూపర్ హిట్ సినిమాలు వచ్చాయి. పైగా హ్యాట్రిక్ ప్రాజెక్ట్ గా కోహినూర్ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. "కోహినూర్ వజ్రాన్ని తిరిగి తీసుకురావడం" అనే సంచలన కథాంశంతో ఈ చిత్రం రూపొందనుంది. వైవిధ్యమైన కథలు, పాత్రల ఎంపికతో అనతికాలంలోనే తనదైన కల్ట్ ఫాలోయింగ్‌ను సొంతం చేసుకున్న సిద్ధూ ఇప్పుడు, నిర్మాత నాగవంశీతో మరో ఇంట్రెస్టింగ్ మూవీ చేయబోతున్నాడు.సిద్ధు జొన్నలగడ్డ-నాగవంశీ కలయికలో 'అర్జున్ రెడ్డి' లాంటి సినిమా చేయడానికి సన్నాహాలు చేస్తున్నారట. ప్రస్తుతం కథ పై చర్చలు జరిగాయని.. సిద్ధు జొన్నలగడ్డ ఆ సినిమా పై చాలా ఆసక్తిగా ఉన్నాడని.. కచ్చితంగా తమ కలయికలో మరో మంచి సినిమా అవుతుందని నాగవంశీ చెప్పుకొచ్చారు. మరి విభిన్నమైన మరియు ప్రత్యేకమైన కథాంశంతో రూపొందుతున్న ఆ చిత్రం ఎప్పుడు స్టార్ట్ అవుతుంది ?, ఎప్పుడు రిలీజ్ అవుతుందో చూడాలి.

